క్లుప్తంగా

ప్రొసీడింగ్ కాపీ అందజేత

భైంసారూరల్: మండలంలోని ఎల్వత్‌లో అన్నాభావు సాఠే కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం రూ.రెండు లక్షలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను శుక్రవారం దేగాంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సంఘం సభ్యులకు అందజేశారు. జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ సాగరాబాయిరాజన్న, నారాయణరావు, ఉత్తమ్ బాలేరావు, దిగంబర్, కమలాకర్, చందు, బాబు, రోహిదాస్ తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాంచందర్

కడెం: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకోవాలని ఐసీటీసీ కౌన్సిలర్ రాంచందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షల వివరాలు గోప్యంగా ఉంటాయని.. సందేహాలుంటే 1097కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాజారాం, సీసీలు స్వామి, నర్సయ్య, విఠల్ తదితరులున్నారు.

శ్రమదానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్ జర్నలిస్ట్ కాలనీలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వయం సేవకులు శుక్రవారం శ్రమదానం చేశారు. కాలనీలోని సంఘ భవనంలో పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు ఉన్నారు.

మద్యం పట్టివేత

తానూరు: మండలంలోని మొగ్లిలో అనుమతి లేకుండా అమ్ముతున్న మద్యం బాటిళ్లను జబ్బార్ అనే వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు శుక్రవారం దాడి చేసి రూ.2400 విలువైన మద్యం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. పట్టుకున్న మద్యాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులకు అప్పగిస్తామని వివరించారు.

పాఠశాల, పీహెచ్‌సీ తనిఖీ




భోజనం పరిశీలిస్తున్న అధికారి రాజేశ్వర్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని ఆశ్రమోన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి రాజేశ్వర్ గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనం పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో రమేశ్, ఎంపీవో రమేశ్‌రెడ్డి, వైద్యాధికారి విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మహాసమ్మేళనం కరపత్రాలు ఆవిష్కరణ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహం సమీపంలో శుక్రవారం ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) కార్యకర్తలు మహాసమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఆదిభట్ల పీఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో నవంబర్ 3న మహా సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనంలో పార్టీ కార్యక్రమాలను కార్యకర్తల సమక్షంలో అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ వెల్లడిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాజు మహరాజ్, సాన్న భూమేశ్, కత్తి శేఖర్ పాల్గొన్నారు.

సిలబస్ పూర్తిచేయాలి



విద్యార్థి రికార్డు పరిశీలిస్తున్న పరశురాం

భైంసాటౌన్: ఇంటర్ విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని.. పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని డీఐఈవో పరశురాం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, సిలబస్, తదితర వివరాలను ప్రిన్సిపాల్ శివరంజనిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు అధ్యాపకులు ఉన్నారు.

సమాచారం ఇవ్వలేదని ఫిర్యాదు

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్‌లో శుక్రవారం డీసీఎంఎస్ ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి తనకు సమాచారం ఇవ్వలేదని తహసీల్దార్ జానకి పేర్కొన్నారు. ప్రొటోకాల్ పాటించని నిర్వాహకుడు నవీన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ప్రమాణాలు పాటిస్తేనే 'మద్దతు'

- గ్రామాల్లో ప్రారంభమైన వరికోతలు
- జిల్లావ్యాప్తంగా 269 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- రైతులు నిబంధనలు పాటించాలంటున్న అధికారులు



లక్ష్మణచాంద మండలం చామన్‌పెల్లిలో పొలం కోస్తున్న హార్వెస్టర్

లక్ష్మణచాంద: జిల్లాలో ఇప్పుడిప్పుడే వరికోతలు ఊపందుకుంటున్నాయి. దీంతో ప్రభుత్వం కొన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా.. మరికొన్ని చోట్ల కేంద్రాలు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 1,35,000 ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇప్పటికే కొన్నిచోట్ల వరికోతలు మొదలవగా.. మరికొన్ని చోట్ల ప్రారంభం కావాల్సి ఉంది. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే సమయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు. రైతులు ఈ సూచనలు పాటించి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని పేర్కొంటున్నారు.

జిల్లాలో 269 కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో 269 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు తెలిపారు. డీఆర్డీఏ ఆధ్వర్యంలో 84, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 101, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 79, జీసీసీ ఆధ్వర్యంలో ఐదు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో దొడ్డురకం ధాన్యానికి సంబంధించిన కొనుగోలు కేంద్రాలు డీఆర్డీఏ ఆధ్వర్యంలో 39, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 57, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 48, జీసీసీ ఆధ్వర్యంలో 3 మొత్తం 147 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. సన్నరకం కొనుగోలు కేంద్రాలు డీఆర్డీఏ ఆధ్వర్యంలో 45, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 44, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 31, జీసీసీ ఆధ్వర్యంలో రెండు మొత్తం 122 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

సన్నాలకు రూ.500 బోనస్..

ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2300ను ప్రభుత్వం ప్రకటించింది. 33 రకాల వంగడాలకు సంబంధించిన సన్నరకాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈమేరకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ధాన్యం డబ్బులు పడిన తర్వాత కొద్దిరోజులకు బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమవుతాయని పేర్కొంటున్నారు.

వరికోతల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు..

- రైతులు పూర్తిస్థాయిలో పొలం ఎండిన తర్వాత.. పంటలో తేమశాతం తక్కువ ఉన్నప్పుడు కోయాలి. లేదంటే తప్ప, తాలు ఏర్పడే అవకాశం ఉంది.
- ఎకరం పొలాన్ని హార్వెస్టర్ 70 నుంచి 90 నిమిషాల మధ్యలో కోసేలా చూసుకోవాలి.
- పొలంలో నడిచేటప్పుడు యంత్రం వేగం 18 ఎం.పీ.ఆర్, ఫ్యాన్ వేగం అధికంగా ఉండేలా చూడాలి.
- యంత్రంలో జల్లెడ పరిమాణం సరైనది ఉందో లేదో చూసుకోవాలి.

నిబంధనలు పాటించాలి

వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చేటప్పుడు రైతులు నిబంధనలు పాటించాలి. తేమశాతం 17 ఉండి.. తప్ప, తాలు లేకుండా చూడాలి. అన్నీ సరిగ్గా ఉంటేనే పంటకు బోనస్, మద్దతు ధర లభిస్తాయి. ఇప్పటికే లక్ష్మణచాంద, లోకేశ్వరం, ముధోల్, భైంసా మండలాల్లోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం.

– గోపాల్, డీఎం, జిల్లా పౌరసరఫరాలశాఖ

కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు..

- పొలం కోసిన తర్వాత ధాన్యంలో తప్పలు, తాలు, మట్టిపెళ్లలు, రాళ్లు వంటివి లేకుండా చూడాలి.
- పంట ఆరబెట్టిన తర్వాత ధాన్యంలో తేమశాతం 17 ఉండేలా చూసుకోవాలి.
- ధాన్యాన్ని తూర్పార పట్టడం లేదా ఇతర ప్రక్రియ ద్వారా శుద్ధి చేసిన తర్వాతనే కేంద్రానికి తీసుకురావాలి.

అమరుల త్యాగాన్ని మరువొద్దు



జ్యూస్ అందిస్తున్న ఎస్పీ జానకీషర్మిల



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న పోలీసులు

- ఎస్పీ జానకీషర్మిల
- రక్తదానం చేసిన పోలీసులు

నిర్మల్‌టౌన్: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను మరువొద్దని ఎస్పీ జానకీషర్మిల అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. రక్తదానం చేసిన పోలీస్ సిబ్బందిని అభినందించారు. వారికి పండ్లు, జ్యూస్‌లు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అమరవీరులు సమాజం కోసం, దేశం కోసం, రేపటి తరాల భవిష్యత్తు కోసం, ప్రాణ త్యాగాలు చేశారని తెలిపారు. వారి త్యాగాలు వెలకట్టలేమన్నారు. రక్తదానం సామాజిక సేవా కార్యక్రమమని ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసిన వారు, వారి పాలిట దేవుళ్లుగా మారతారన్నారు. ఈ శిబిరంలో 120 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, నవీన్‌కుమార్, ఆర్ఐలు రామ్‌నిరంజన్, శేఖర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులకు వ్యాసరచన పోటీలు

సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏఆర్ పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు సమాజంలో పోలీస్ ప్రతిష్ఠను మెరుగుపరచడంలో పోలీసుల పాత్ర అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఎస్సై నుంచి పైస్థాయి అధికారి వరకు దృఢమైన శరీరంలో దృఢమైన మనసు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

భైంసా రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్



ఆయుధాల పనితీరును వివరిస్తున్న ఏఎస్పీ

భైంసారూరల్: భైంసారూరల్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఓపెన్ హౌస్ ఏర్పాటు చేశారు. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ అమరవీరుల త్యాగాన్ని స్మరించుకున్నారు. విద్యార్థులు విద్యతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పోలీసుల విధులు, ఫింగర్ ప్రింట్ నమూనాల సేకరణ, డయల్ 100, షీ టీం, డ్రంకెన్‌డ్రైవ్, సైబర్‌క్రైం తదితర వివరాలను తెలియజేశారు. ఆయుధాల వినియోగం వివరించి స్టేషన్‌లో రికార్డుల పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భైంసారూరల్ సీఐ నైలు, ఎస్సై శ్రీనివాస్‌యాదవ్, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే పంట విక్రయించాలి



సారంగపూర్: ధనిలో కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో కేంద్రం ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి

సారంగపూర్: రైతులు తమ పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి మద్దతుధర పొందాలని ఏఎంసీ చైర్మన్ అబ్దుల్‌హాదీ అన్నారు. సారంగపూర్ మండలంలోని ధని గ్రామంలో శుక్రవారం ఆలూరు పీఏసీఎస్ చైర్మన్ మాణిక్‌రెడ్డితో కలిసి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. చైర్మన్‌గా నియమితులై తొలిసారిగా గ్రామానికి వచ్చిన అబ్దుల్‌హాదీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడెల్లి ఆలయ మాజీ చైర్మన్ ఆయిటి చందు, మాజీ సర్పంచ్ చిన్నయ్య, ముత్యంరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ఆయిటి శ్రీనివాస్, బడి పోతన్న తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: రైతులు తమ పంటను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వడ్యాల్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, నాయకులు నరేశ్‌రెడ్డి, ఓస రాజేశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, నారా గౌడ్, ప్రతాప్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని కామోల్‌లో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రతాప్‌సింగ్, శ్రీనివాస్, రాంకిషన్, విఠల్‌సింగ్, మహేందర్, ధర్మారెడ్డి, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీం స్ఫూర్తితో ముందుకు సాగాలి



కుభీర్‌లో ఆవిష్కరించిన కుమురం భీం విగ్రహం వద్ద నాయక్‌పోడ్‌లు

కుభీర్: కుమురం భీం పోరాట స్ఫూర్తితో యువత ఆదివాసీ హక్కుల కోసం పోరాడాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం కుభీర్‌లో బస్టాండ్ పక్కన పోరాట యోధుడు భీం విగ్రహాన్ని గిరిజన నాయకులు ఆవిష్కరించారు. అంతకుముందు మండలంలోని వివిధ గ్రామాల నాయక్‌పోడ్ కులస్తులు(ఆదివాసీలు)కుభీర్‌కు డప్పుచప్పుళ్లు, హారతులతో తరలివచ్చారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో నాయక్‌పోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం.రాజయ్య, రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి సతీశ్, ఎం.విఠల్, ముత్తన్న, బెజన్న, లింగన్న, విఠల్, లక్ష్మణ్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాలు సీజ్



న్యూబొప్పారంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సోన్: యాసంగి సాగు పనులు ప్రారంభమవుతున్నందున రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని నిర్మల్ ఏడీఏ (అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆఫీసర్) భాస్కర్ అన్నారు. ఈ సందర్భంగా వారు శుక్రవారం సోన్‌తోపాటు న్యూబొప్పారంలో ఉన్న ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు సమయంలో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. డీలర్లు ఇచ్చిన రసీదులను రైతులు భద్రపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో వినోద్‌కుమార్, డీలర్ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ గ్రామసభలు

లక్ష్మణచాంద: మండలంలోని నర్సాపూర్‌లో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభను నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించి ప్రణాళికల తయారు చేశారు. ఎంపీడీవో రాధ మాట్లాడుతూ గ్రామస్తులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం వెళ్లి కిచెన్ గార్డెన్‌లో తాజా కూరగాయలు ఉండటంతో టీచర్ భాగ్యలక్ష్మిని అభినందించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్లలో కూరగాయలు సాగు చేయాలని టీచర్లకు సూచించారు. ఎంపీఓ అమీర్ ఖాన్, కార్యదర్శి, కళాజాత సిబ్బంది పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని సింగన్‌గాంలో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పనులు గుర్తించి ప్రణాళికలు తయారు చేసి గ్రామస్తులకు వినిపించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే మార్గంలో రోడ్లు, పూడికతీత పనులు చేపడుతున్నట్లు ఎంపీడీవో అబ్దుల్ సమద్ పేర్కొన్నారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు అందిస్తామని ఈజీఎస్ ఏపీవో గంగాధర్ సూచించారు. ఎఫ్ఏలు, కూలీలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సీపీఎం మహాసభలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఈనెల 28, 29 తేదీల్లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించే సీపీఎం జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొమ్మెన సురేశ్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మహాసభలకు ముఖ్య అతిథిగా సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి, జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య హాజరవుతున్నారని పేర్కొన్నారు. 28న మధ్యాహ్నం 12 గంటలకు మినీట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభమై టీఎన్జీవోస్ సంఘ భవనం వరకు కొనసాగుతుందన్నారు. 29న ప్రతినిధుల సభ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, పోశెట్టి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కుంటాల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా కుంటాలలో ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. పాత్రలు, టైర్లు, నీటిట్యాంకుల్లోని నీటిని పారబోయించారు. ఎంపీవో రహీంఖాన్, కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

డ్రై డేపై అవగాహన

నర్సాపూర్(జి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ అన్నారు. మండల కేంద్రంలో ఫ్రైడే డ్రై డేలో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్ విఠల్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు. భగీరథ వాటర్ ట్యాంకును ఎంపీఓ తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాథోడ్ కైలాస్ పరిశీలించారు. ట్యాంకును ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.

వీడీసీ భవనం ప్రారంభం

బాసర: మండల కేంద్రంలో శుక్రవారం వీడీసీ భవనాన్ని ప్రారంభించారు. గతంలో అవుట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ గా ఉన్న భవనాన్ని నేడు వీడీసీ భవనంగా మార్చారు. తెల్లవారుజామున వేద మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ అర్చకులు భవనం ప్రారంభించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలో 27 కులాల వారుండగా.. ఒక్కో కుల సంఘం నుంచి ఇద్దరిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసుకొని వీడీసీ కార్యవర్గాన్ని నియమించినట్లు వీడీసీ అధ్యక్షుడు కృష్ణాగౌడ్ తెలిపారు.

ఎన్నిక ఏకగ్రీవం

ముధోల్: తానూర్, ముధోల్ మండలాల ట్రస్మా కమిటీని శుక్రవారం ముధోల్‌లోని రబీంద్ర పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రబీంద్ర పాఠశాల ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్, జనరల్ సెక్రటరీగా విష్ణువర్ధన్‌రెడ్డి(ఆర్యభట్ట, తానూరు), వైస్ ప్రెసిడెంట్‌గా వి.రమేశ్(విజేత తానూరు), జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్(ఫ్యూచర్ ఎడ్‌విడ్), ట్రెజరర్‌గా విశ్వనాథ్(వివేకానంద తానూరు), ఎన్నికల సంఘం సభ్యులుగా అరవిందరెడ్డి, నర్సయ్య, సుభాశ్, నజీజ్‌ఖాన్, ప్రతినిధిగా రామకృష్ణ, స్టేట్ బాడీ మెంబర్‌గా ఎ.రాజేందర్ ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

'ఇతరులకు ప్రాధాన్యమివ్వడం సరికాదు'

భైంసాటౌన్: కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన వారిని కాదని.. ఇతరులకు ఏఎంసీ పాలకవర్గ నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కమల జిన్నింగ్ ఫ్యాక్టరీలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణ్‌రావు పటేల్‌ను పరిగణనలోకి తీసుకోకుండా భైంసా ఏఎంసీ పాలకవర్గాన్ని ఏకపక్షంగా నియమించారని ఆరోపించారు. కుభీర్ ఏఎంసీ ఎస్సీ రిజర్వుడ్ అయిప్పటికీ పాలకవర్గాన్ని ఎందుకు నియమించడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో శంకర్ చంద్రే, రాంచందర్‌రెడ్డి, ప్రేంనాథ్‌రెడ్డి, ముత్యంరెడ్డి, తదితరులున్నారు.

నూతన కార్యవర్గం

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాందలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గ్రామ కమిటీని గంగాధర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కొప్పెల్లి ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా రమేశ్, ప్రధాన కార్యదర్శిగా రాజేందర్, కోశాధికారిగా తాండ్ర రాజేశ్వర్, సహాయ కార్యదర్శిగా లింగన్న ఎన్నికయ్యారు.

ఆయిల్‌పాం సాగుపై అవగాహన

దస్తురాబాద్: మండలంలోని మున్యాలలో ఆయిల్ పాం సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్రాప్ మేనేజర్ కరుణాకర్ రెడ్డి, క్లస్టర్ అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని నిగ్వాలో శుక్రవారం ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. కంపెనీ ఏరియా మేనేజర్ అడెపు శేఖర్, మాజీ సర్పంచ్ రాజు, ఉద్యానవన శాఖ అధికారి జావెద్‌పాషా ఉన్నారు.

అర్హులను ఓటరుగా నమోదు చేయించాలి

నిర్మల్‌చైన్‌గేట్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మ రాజు అన్నారు. ఆయన నిర్మల్‌లోని కళాశాలల ప్రిన్సిపాల్, యాజమాన్యాలను కలిసి తమ పరిధిలో ఉన్న పట్టభద్రులను ఓటరుగా నమోదు చేయించాలని కోరారు. పట్టభద్రుల పట్టణ ఇన్‌చార్జి ఒడ్నాల రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని లింబా(బి)లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటుహక్కును నమోదు చేయించారు. బీజేపీ మండల కన్వీనర్ సాయి సూర్యవంశీ, అశోక్ కుమార్, నారాయణ, గోవింద్, శైలేశ్ పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ

తానూరు: మండలంలోని కోలూరులోని తెలుగు, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో నరేందర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించి.. పూర్తిస్థాయిలో పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ప్రధానోపాధ్యాయుడు ముత్తన్నకు సూచించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సీఆర్పీ గంగాధర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ప్లాట్లు పరిశీలన

కుంటాల: ఎల్ఆర్ఎస్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో లింబాద్రి సూచించారు. శుక్రవారం కుంటాలలో ప్లాట్లను పరిశీలించారు. ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ఆర్ఐ అడెల్లు, కార్యదర్శి రాజబాపు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో శుక్రవారం ఎల్ఆర్ఎస్ ప్లాట్లను పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదు చేశారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఆర్ఐ వేణుగోపాల్, కార్యదర్శి కైలాస్ ఉన్నారు.

'బకాయిలు విడుదల చేయాలి'

భైంసాటౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించడకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వర్షిత్, జశ్వంత్, మనోజ్, విఠల్, అరుణ్ పవార్, బబ్లూ, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు ప్రారంభం

మామడ: పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటుతో విద్యార్థులకు మేలు జరుగుతుందని ఎంఈవో వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కొరిటికల్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయం ప్రారంభించి మాట్లాడారు. 700 కథల పుస్తకాలను అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రమణయ్య, రూమ్‌టురీడ్ మండల కోఆర్డినేటర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఎంఈవో రమణారెడ్డి, ఎంపీడీవో శివకుమార్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. రూమ్‌టురీడ్ సంస్థ కోఆర్డినేటర్ మమత, ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అమీర్ ఖుస్రు తదితరులున్నారు.

మాలేగాంలో..

కుభీర్: మండలంలోని మాలేగాం ప్రాథమిక పాఠశాలలో రీడ్ టూ రూం సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎంఈవో రాజులదేవి విజయ్‌కుమార్ ప్రారంభించారు. హెచ్ఎంలు షకీలా, అనిరుద్, మండల కోఆర్డినేటర్ రాము తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన



మస్కాపూర్‌లో మాట్లాడుతున్న నరేంద్రబాబు

ఖానాపూర్: ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ యూనియన్ ముందుంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆశ్రమ పాఠశాల, బాలికల జెడ్పీహెచ్ఎస్, ఉన్నత పాఠశాల, ఎంజేపీ, పాత ఎల్లాపూర్, మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్, కేజీబీవీలలో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. పీఆర్టీయూ బలపరిచిన అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. కేపీరెడ్డి, ప్రవీణ్, నర్సయ్య, గంగన్న, మురళి, రాఘవేంద్రవర్మ తదితరులున్నారు.